క్లుప్తంగా

ప్రజారోగ్యానికి ప్రాధాన్యం



సమావేశంలో మాట్లాడుతున్న మురళి

పెద్దాపురం: ప్రజారోగ్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని మండల గృహ సారథుల కన్వీనర్ గోపు మురళి అన్నారు. మండలంలోని తాటిపర్తి గ్రామంలో కాకినాడ రంగరాయ వైద్య కళాశాల వైద్య బృందంచే ఫ్యామిలీ డాక్టర్‌పై శుక్రవారం సర్వే నిర్వహించారు. ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రామ్ నోడల్ అధికారి డాక్టర్ బి.దేవిమాదవి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మురళి మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. గ్రామీణ ప్రజలు వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం గ్రామంలో వైద్య బృందం, వలంటీర్లచే సర్వే నిర్వహించారు. వైద్యులు రుక్మిణి, మెర్సీ డేవిస్, శ్రావణి, సిబ్బంది పాల్గొన్నారు.

బంగారు, వెండి పుష్పాలతో మరిడమ్మకు పూజలు



బంగారు, వెండి పుష్పాలతో పూజలు చేస్తున్న భక్తులు

పెద్దాపురం: స్థానిక మరిడమ్మ తల్లికి శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో పూజలు చేశారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్‌వీ రామ్మోహనరావుల ఆధ్వర్యంలో కార్తిక మాస ద్వాదశి పూజల్లో భాగంగా అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, చండీహోమం చేశారు.

ఏపీపీగా కామేశ్వరరావు బాధ్యతల స్వీకరణ

పెద్దాపురం: స్థానిక సీనియర్ సివిల్ జడ్జి కోర్టు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏపీపీ)గా రాగం కామేశ్వరరావు నియమితులయ్యారు. శుక్రవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ఆయనను పలువురు న్యాయవాదులు, ప్రముఖులు అభినందించారు.

పశ్చిమ గోదావరి చేరిన పాదయాత్ర



సామర్లకోటకు చెందిన యార్లగడ్డ శ్రీనివాసుకు జ్ఞాపికను అందజేసిన వాసుదేవ గురుస్వామి

సామర్లకోట: మండల పరిధిలోని గొంచాల గ్రామం నుంచి 400 మంది భక్తులు శ్రీరామ రథంతో పాదయాత్ర శుక్రవారం పశ్చిమ గోదావరి జిల్లా గోపాలపురం చేరింది. సామర్లకోటకు చెందిన రైతు సంఘ నాయకుడు యార్లగడ్డ శ్రీనివాసు శుక్రవారం సాయంత్రం వారికి అల్పాహారం ఏర్పాటు చేసినట్లు పాదయాత్ర నిర్వాహకుడు వాసుదేవ సుబ్బారావు (గురుస్వామి) తెలిపారు. గొంచాల నుంచి ఏటా కాలినడక భక్తులు భద్రాచలం వెళ్తున్నారు.

25 వేల ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ



సచివాలయంలో ఆరోగ్యశ్రీ కార్డుల డేటాను పరిశీలిస్తున్న ఎంపీడీఓ వెంకటనారాయణ

కొత్తపల్లి: మండల పరిధిలో ఇప్పటివరకూ సుమారు 25 వేల మంది లబ్ధిదారులకు ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేసినట్టు ఎంపీడీఓ వెంకటనారాయణ తెలిపారు. మండలంలోని కొండెవరంలో శుక్రవారం ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీని ఆయన పరిశీలించారు. గ్రామ సచివాలయంలో ఆరోగ్యశ్రీ కార్డుల డేటాను పరిశీలించారు. మిగిలిన లబ్ధిదారులకు త్వరితగతిన కార్డుల పంపిణీ పూర్తి చేయాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో సుమారు 5 వేల కార్డులకు సంబంధించిన లబ్ధిదారులు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారని తెలిపారు. మిగిలిన కార్డులు వారం రోజుల్లో పంపిణీ చేస్తామని చెప్పారు.

స్వామి వారికి పూజలు

తుని రూరల్: ఎస్.అన్నవరంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి జన్మనక్షత్రం శ్రవణాన్ని పురస్కరించుకుని పండితులు స్వామివారికి పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

జంక్షన్‌లో ట్రాఫిక్ టెన్షన్!

- పిఠాపురం తరచూ ట్రాఫిక్ సమస్య
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



ఉప్పాడ సెంటర్లో రోడ్డుకు అడ్డుగా నిలిపిన ఆటోలు

పిఠాపురం: పట్టణంలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకూ తీవ్రతరమవుతోంది. నిత్యం పట్టణంలో వేలాదిగా వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. ఆటోవాలాలు ఇష్టారాజ్యంగా వ్యవహరించడం, పలువురు వాహనచోదకులు నిబంధనలు పాటించకపోవడంతో కొత్త ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. పట్టణంలో ట్రాఫిక్ సమస్య లేకుండా చేస్తాం.. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తాం అంటూ పోలీసులు చేస్తున్న ప్రకటనలు మాటలకే పరిమితమవుతున్నాయి. ఆ హామీలు కార్యరూపం దాల్చడం లేదు. ఏనాడు ఒక ట్రాఫిక్ పోలీసు పట్టణంలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించిన పాపానపోలేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. పట్టణంలో ఇష్టారాజ్యంగా తిరుగుతూ ప్రయాణికులకు నరకం చూపిస్తున్న ఆటోలను, భారీ వాహనాలను పోలీసులు పట్టించుకోలేదని ప్రజలు విమర్శిస్తున్నారు.

నిత్యం 10 వేల ఆటోలు రాకపోకలు

దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న పిఠాపురం పట్టణం వేల మంది జనాభాతోపాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారితో నిత్యం కిటకిటలాడుతూ ఉంటుంది. ప్రతిరోజూ 10 వేల ఆటోలు పట్టణంలో తిరుగుతున్నట్లు పోలీసులు చెబుతున్నారు. పిఠాపురానికి బైపాస్‌రోడ్డు నిర్మించినప్పటికీ అతి తక్కువ వాహనాలే ఆ మార్గంలో వెళతాయి. మిగిలిన వాహనాలన్నీ పట్టణం మీదుగానే వెళుతుంటాయి. ముఖ్యంగా ఆటోలు ఇష్టారాజ్యంగా ఎక్కడపడితే అక్కడ ఆపి రోడ్డుకు అడ్డంగా పార్కింగ్ చేస్తున్నా పట్టించుకునే నాథుడే లేడని వాహనచోదకులు వాపోతున్నారు. పట్టణంలో ప్రధాన కూడళ్లుగా ఉన్న ఉప్పాడ సెంటర్, కోటగుమ్మం సెంటర్, చర్చి సెంటర్, సినిమా సెంటర్ల వద్ద ఎటువంటి సిబ్బంది లేకపోవడంతో ఆటోలు, ఇతర వాహనాలను రోడ్డుకు అడ్డంగా నిలుపుతున్నారు. దీంతో ట్రాఫిక్ నిలిచిపోయి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఆటోవాలాలతో సమావేశం ఏర్పాటు చేసి హెచ్చరికలు జారీ చేసిన పోలీసులు ఆ తర్వాత వదిలేయడంతో మళ్లీ ఆటోవాలాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య మరింత జటిలమవుతోంది. నిర్దిష్టమైన ట్రాఫిక్ ఆంక్షలు లేక పోవడంతో వాహనాలను ఎవరి ఇష్టానుసారం వారు నిలిపివేస్తున్నారు. ఆటోలను ఇష్టానుసారం ఎక్కడపడితే అక్కడ నిలపడం వల్ల గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోయి నరకం చవిచూస్తున్నామని ప్రయాణికులు వాపోతున్నారు. పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు పోలీసులు అరకొర సిబ్బందినే నియమిస్తున్నారు. పెద్ద నాయకులు వచ్చినప్పుడు సెంటర్‌కు ఇద్దరేసి కాపలా ఉండే పోలీసులు సాధారణ సమయాల్లో మాత్రం ఒక్కరు కూడా ఉండడం లేదు.

రోడ్లపైనే వాహనాలు

పట్టణంలోని ప్రధాన కూడళ్లు అయిన ఉప్పాడ సెంటర్, చర్చి సెంటర్, రైల్వే స్టేషన్ సెంటర్, కోటగుమ్మం సెంటర్ తదితర ప్రాంతాల్లో వాహనాలను ఇష్టారాజ్యంగా నిలుపుతున్నారు. రోడ్లపైనే వాహనాలను నిలపడం వల్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఉప్పాడ సెంటర్లో రోడ్డుకు ఇరువైపులా వాహనాల పార్కింగ్ ఎక్కువగా ఉంటోంది. బంగారమ్మ రావి చెట్టు వద్ద ఆర్టీసీ బస్సులు ఆగాల్సి ఉండగా ఆటోలను అడ్డుగా పెడుతున్నారని ప్రయాణికులు వాపోతున్నారు. ఇక్కడ ఒకేసారి 10 నుంచి 20 ఆటోలను నిలపడంతో ప్రజలు నడవడానికి కూడా వీలు లేకుండా పోతోంది.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు

పట్టణంలో ట్రాఫిక్ సమస్య నివారణకు త్వరలో చర్యలు తీసుకుంటాం. ఆటోలను ఇష్టారాజ్యంగా పార్కింగ్ చేయడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపై చిరు వ్యాపారులను ఖాళీ ప్రదేశాలకు తరలించి ఆటోలు నిర్దిష్టమైన ప్రాంతాల్లో పార్కింగ్ చేసే విధంగా చర్యలు తీసుకుంటాం. ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా అమలు చేస్తాం.

– శ్రీనివాస్, సీఐ, పిఠాపురం

క్రీడాకారులకు అభినందనలు



మూలపేటలో మహిళా క్రీడాకారులను అభినందిస్తున్న నాయకులు

కొత్తపల్లి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు గ్రామీణ క్రీడాకారుల్లో దాగిఉన్న ప్రతిభను వెలికి తీశాయని వైఎస్సార్ సీపీ నాయకుడు కంబాల లక్ష్మణరావు అన్నారు. ఆడుదాం ఆంధ్రా మహిళా కబడ్డీ పోటీల్లో మండలంలోని మూలపేట క్రీడాకారులు నియోజకవర్గ, జిల్లా స్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. కాగా ప్రతిభ చూపిన క్రీడాకారులను గ్రామ సర్పంచ్ కంబాల మానిక ఆధ్వర్యంలో శుక్రవారం సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కంబాల లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహిస్తోందన్నారు. ఆడుదాం ఆంధ్రా పోటీల ద్వారా గ్రామానికి గుర్తింపు వచ్చిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు అడ్డా త్రిమూర్తులు, మేరుగు తాతారావు, కంబాల శ్రీరాములు, చోడిపల్లి శ్రీను, మేరుగు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి మహిళా వ్యాపారవేత్త కావాలి

- నియోజకవర్గ కోఆర్డినేటర్ దవులూరి
- వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ



పీబీ దేవంలో మహిళా సంఘాలకు నమూనా చెక్కు అందజేసిన దవులూరి దొరబాబు

సామర్లకోట: మహిళా ప్రగతితోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని నియోజకవర్గ కో ఆర్డినేటర్ దవులూరి దొరబాబు అన్నారు. శుక్రవారం ఉదయం పీబీ దేవంలో, సాయంత్రం జి.మేడపాడు, జి.కొత్తూరు గ్రామాల్లో మహిళా సంఘాలకు నిర్వహించిన ఆసరా కార్యక్రమాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం వి.ప్రశాంతి అధ్యక్షతన మండల పరిధిలో 1645 మహిళా సంఘాలకు రూ.12.3 కోట్లు నాలుగో విడత నిధులు మంజూరైనట్టు పేర్కొన్నారు. పీబీ దేవంలోని 169 సంఘాలకు రూ.1.69 కోట్లు, జి.మేడపాడులోని 158 సంఘాలకు రూ.78.71 లక్షలు, జి.కొత్తూరులోని 24 సంఘాలకు రూ.20.38 లక్షలు మంజూరైనట్టు వివరించారు. ఇచ్చిన హామీని కచ్చితంగా అమలు చేసిన ఇటువంటి ముఖ్యమంత్రి తిరిగి అధికారంలోనికి రావడానికి ఫ్యాను గుర్తుపై ఎంపీకి ఒకసారి, ఎమ్మెల్యేకు ఒకసారి పొలింగ్ రోజున బటన్ నొక్కాలని దొరబాబు పిలుపు నిచ్చారు. స్థానిక అభ్యర్థికి అవకాశం కల్పిస్తూ ఈ నియోజకవర్గం నుంచి పోటీ చేసే అవకాశాన్ని సీఎం జగన్ కల్పించారని, ప్రతి ఒక్కరూ తనను ఆశీర్వదించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. పీబీ దేవం సొసైటీ అధ్యక్షుడు మలకల వరహాలబాబు, ఉప సర్పంచ్ మలకల సత్య ఆయనను సత్కరించారు. ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, ఎంపీడీఓ ఎస్డీ శ్యామ్‌సుందర్, సర్పంచ్‌లు నీలపాల సత్యనారాయణ, పటాని దేవి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మోరంపూడి శ్రీరంగనాయకులు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మోరంపూడి రమేష్, ఎంపీటీసీ సభ్యుడు మలకల సూరిబాబు, సొసైటీ అధ్యక్షులు మలకల వరహాలబాబు, వీరంరెడ్డి నాని, వైఎస్సార్ సీపీ నాయకులు, మహిళా సంఘాల ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దొరబాబు మహిళా సంఘాలకు నమూనా చెక్కు అందజేశారు. మహిళా సంఘాల సభ్యులు సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

వ్యవసాయశాఖ ప్రభుత్వ సలహాదారు తిరుపాల రెడ్డి



సామర్లకోటలో రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయశాఖ ప్రభుత్వ సలహాదారు తిరుపాలరెడ్డి

సామర్లకోట: ప్రభుత్వం రైతులకు అందజేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయశాఖ ప్రభుత్వ సలహాదారు తిరుపాల రెడ్డి అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా శుక్రవారం స్థానిక పంచారామ క్షేత్రం బాలాత్రిపుర సుందరి సమేత కుమారా రామభీమేశ్వరస్వామి ఆలయంలో ఆయన పూజలు చేశారు. ఈఓ డి.నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో ఆలయ పండితులు స్వాగతం పలికారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకున్న ఆయనకు ఆలయ పండితులు ఆశీర్వచనాలు ఇచ్చారు. అనంతరం భీమవరం ప్రాంతంలోని రైతులను కలిసి వారి నుంచి అభిప్రాయాలను సేకరించారు. పురుగు మందులు కూడా ఆర్బీకేల్లోకి అందుబాటు లోనికి తీసుకురావడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. ఆర్బీకేలోని సిబ్బంది పనితీరుపై అభిప్రాయాలను సేకరించారు. పవర్ స్ప్రేయర్లు, పవర్ టిల్లర్లు రైతులకు వ్యక్తిగతంగా అందేలా చూడాలని రైతులు ఆయనకు వివరించారు. జిల్లా ఇన్‌చార్జి వ్యవసాయ అధికారి బీవీఎస్ హరి, డివిజన్ వ్యవసాయశాఖ ఏడీఏ జీవీ పద్మశ్రీ, మండల వ్యవసాయ శాఖాధికారి ఐ.సత్య, ఏఈఓ ఎంవీ సతీష్, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఫొటోగ్రఫీ వృత్తితో మంచి గుర్తింపు



కృష్ణా డిజిటల్ ల్యాబ్ అధినేత అమిత్‌తో సంఘ సభ్యులు

కొత్తపల్లి: ప్రస్తుత సమాజంలో ఫొటోగ్రఫీ వృత్తి ఎంతో గుర్తింపును ఇస్తోందని కృష్ణా డిజిటల్ ల్యాబ్ అధినేత అమిత్ అన్నారు. స్థానిక సతీష్ చంద్ర భవనంలో శుక్రవారం మండల ఫొటో అండ్ వీడియో గ్రాఫర్ల అసోసియేషన్ అధ్యక్షుడు వాసంశెట్టి కామేశ్వరరావు ఆధ్వర్యంలో సంఘ సమావేశం నిర్వహించారు. ఫొటో గ్రాఫర్ల అమిత్ పర్యవేక్షణలో పలు అత్యాధునిక కెమెరాలపై శిక్షణ ఇచ్చారు. వృత్తి నైపుణ్యంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. అనంతరం కృష్ణా డిజిటల్ ల్యాబ్ అధినేత అమిత్‌ను సంఘ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో మండల యూనియన్ కార్యదర్శి పుచ్చల బంగారు బాబి, కోశాధికారి ఎ.నాగేశ్వరరావు, కమిటీ సభ్యులు మలిశెట్టి రంగ, ఎం.రమేష్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

కొత్తపల్లి: ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని, అక్రమంగా నిర్బంధించిన ఆశా కార్యకర్తలను వెంటనే విడుదల చేయాలని మండల ఆశావర్కర్ల సంఘం అధ్యక్షురాలు ఎం.లక్ష్మి డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం ఆందోళన నిర్వహించారు. రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఆందోళనకు సీపీఎం నాయకులు కాళ్ల నాగేశ్వరరావు, గుర్రాల అప్పారెడ్డి మద్దతు తెలిపారు.

ఆశ కార్యకర్తల ధర్నా

సామర్లకోట: కనీస వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆశా కార్యకర్తలు ధర్నా చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ఆందోళనలో భాగంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేసి ఇన్‌చార్జి తహసీల్దార్ ఆర్.శ్రీనివాసరావుకు వారి డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు.

రోడ్డు మధ్యలోనే విద్యుత్ స్తంభాలు



పిఠాపురం-నాగులపల్లి రోడ్డుకు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభం

కొత్తపల్లి: పిఠాపురం-నాగులపల్లి రోడ్డు అభివృద్ధి పనుల్లో భాగంగా రోడ్డుకు ఆనుకున్న ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించాల్సి ఉండగా స్తంభాలను తొలగించకుండా రోడ్డు అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నారు. రోడ్డుకు మధ్యలోనే స్తంభాలను వదిలివేయడంతో ప్రయాణికులు ఏ మాత్రం ఆదమరిచినా ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే పలువురు వాహన చోదకులు ఈ విద్యుత్ స్తంభాల కారణంగా ప్రమాదాల బారిన పడ్డారు. నిబంధనలకు విరుద్ధంగా రహదారి అభివృద్ధి పనులు జరిగినా అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాగా ఈ విద్యుత్ స్తంభాల వద్ద ఎటువంటి హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయకపోవడంపై వాహనచోదకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

డీవార్మింగ్ మాత్రల పంపిణీ



అంగన్‌వాడీ కేంద్రంలో డీ వార్మింగ్ మాత్రలు వేస్తున్న వైద్యులు

పెద్దాపురం: మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ప్రతి ఒక్కరికి డీ వార్మింగ్ మాత్రల పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకున్నట్లు కాండ్రకోట పీహెచ్‌సీ వైద్యులు బి.చంద్రకిరణ్‌బాబు అన్నారు. జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం మండలంలోని ఆయా గ్రామాల్లో ఈ మాత్రల పంపిణీని ఆయన ప్రారంభించారు. ఆయా గ్రామాల్లో 6250 మంది విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేశామన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు సహకరించి ప్రతి విద్యార్థితో నులి పురుగుల మాత్రలు వేయించాలని ఆయన కోరారు.

సామర్లకోట: స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో విద్యార్థులకు హెచ్ఎం తోటకూర సాయి రామకృష్ణ ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం



వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: అమావాస్యను పురస్కరించుకుని రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం ప్రత్యంగిర హోమం నిర్వహించారు. పండితులు ఉదయం తొమ్మిది గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలు సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. పండితులు దత్తాత్రేయ శర్మ, వంశీ, ఫణిశర్మ, దేవులపల్లి ప్రకాష్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం జరిపారు. 95 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు.

అమ్మవార్లకు లక్ష కుంకుమార్చన

ప్రధానాలయంలో సత్యదేవుని దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి ప్రధానార్చకుడు ఇంద్రగంటి నర్సింహమూర్తి ఆధ్వర్యంలోనూ, కొండదిగువన కనకదుర్గ అమ్మవారికి ఆలయ అర్చకుడు కంచిబట్ల సాయిరామ్ ఆధ్వర్యంలోనూ రుత్విక్కులు లక్ష కుంకుమార్చనలు నిర్వహించారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు



మల్లవరంలో వాటర్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న అధికారులు

పిఠాపురం: వేసవికాలం సమీపించడంతో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ కేవీవీ చౌదరి తెలిపారు. గొల్లప్రోలు మండలం మల్లవరం వాటర్ ప్లాంట్‌ను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు అనంతరాజు, శ్రీదేవిలతో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా తనిఖీలు నిర్వహించిన అధికారులు మోటార్ల పనితీరు, పైపులైన్ల పరిస్థితి, ఫిల్టర్ బెడ్‌ల కెపాసిటీని పరిశీలించారు. వాటర్ ప్లాంట్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రాజెక్టు ప్రధాన టాంకు వద్ద చెత్తా,చెదారం పెరిగిపోవడంతో వాటిని వెంటనే తొలగించి పరిసరాలను శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు తీసుకుంటున్నామన్నారు. శివారు ప్రాంతాలైన చినజగ్గంపేట, కొడవలి, కేహెచ్‌పేట తదితర ప్రాంతాలకు తాగునీరు సక్రమంగా అందడం లేదన్న ఫిర్యాదుల నేపథ్యంలో ఆయా ప్రాంతాలకు నీరు సక్రమంగా పంపిణీ చేయడానికి కావాల్సిన ప్రణాళికలు సిద్ధం చేయాలని ఏఈ గౌతు రమణను ఆదేశించారు.

మంచు మసకేసింది లే...



పంట పొలాల్లో కురుస్తున్న మంచు

(అంతరచిత్రం) పిఠాపురం-ఉప్పాడ రోడ్డులో మంచు తెరలు

కొత్తపల్లి: గ్రామాల్లో ప్రతిరోజూ ఉదయం మంచు కురుస్తోంది. ఉదయం 8 గంటలైనా సూరీడు మంచు తెరలను చీల్చుకుని బయటకు రావడం లేదు. రోడ్డు మార్గాలు, ప్రధాన రహదారుల్లో మంచు తెరలు కమ్మేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో పలు చోట్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. రైతులు, పంట పొలాల్లో పనులకు వెళ్లే కూలీలు అవస్థలు పడుతున్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన



ప్రత్తిపాడు హైవేపై ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న ఏఎంవీఐ శ్రీనివాసు

ప్రత్తిపాడు: జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ప్రత్తిపాడు జాతీయ రహదారిపై వాహన చోదకులకు శుక్రవారం అధికారులు వినూత్న రీతిలో అవగాహన కల్పించారు. కత్తిపూడి అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో మోటారు సైకిళ్లు, కార్లపై ప్రయాణించే వారికి హెల్మెట్, సీటుబెల్టు వినియోగంతో కలిగే ప్రయోజనాలను వివరించారు. హెల్మెట్‌తో ప్రయాణించే ద్విచక్రవాహన చోదకులకు, సీటు బెల్టు ధరించిన కారు డ్రైవర్లకు చాక్లెట్లు ఇచ్చారు. హెల్మెట్ లేకుండా, సీటు బెల్ట్ ధరించకుండా ప్రయాణించే వారికి గులాబి పువ్వు అందజేసి, వాటి ఆవశ్యకతను వివరించారు. ఈ సందర్భంగా కత్తిపూడి ఏఎంవీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ కాకినాడ జిల్లాలో గతేడాది రోడ్డు ప్రమాదాల్లో 297 మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. రోడ్డు భద్రతా నియమాలు పాటించని కారణంగానే నెలకు సగటున 25 మంది చనిపోతున్నారని తెలిపారు. ప్రతిఒక్కరూ నిబంధనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు మినర్వా డిగ్రీ కళాశాల విద్యార్థులు, ప్రత్తిపాడు పోలీసులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలను తగ్గించడమే లక్ష్యం

తొండంగి: వచ్చే పదేళ్లలో రోడ్డు ప్రమాదాలను పూర్తిగా తగ్గించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని ఎన్‌హెచ్ఏఐ (కృష్ణవరం టోల్ ప్లాజా) సేఫ్టీ అధికారి వర్మ అన్నారు. జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా మండలంలోని బెండపూడి జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు శుక్రవారం రోడ్డు భద్రత, ప్రమాదాల నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వాహనచోదకులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని సూచిచారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో టోల్‌ప్లాజా మేనేజర్ మూర్తి, ఐఎంటీ మేనేజర్ విజయ్‌బాబు, ఇంచార్జ్ దనకుమార్ రూట్ పెట్రోలింగ్ సిబ్బంది పాల్గొన్నారు.